క్లుప్తంగా

16న పోలవరం నిర్వాసిత కాలనీల సందర్శన

ఏలూరు (టూటౌన్): రాజ్యసభ ఎంపీ సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ ఈనెల 16న ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసిత కాలనీల్లో పర్యటిస్తారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. జాన్‌బ్రిట్టాస్ ఈ నెల 16న మధ్యాహ్నం రెండు గంటలకు బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరం ఆర్అండ్ఆర్ భూములను పరిశీలిస్తారని, రెడ్డి గణపవరం సెంటర్లో సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు జీలుగుమిల్లి మండలం టేకూరు కాలనీ సందర్శిస్తారని తెలిపారు. అక్కడ సభ అనంతరం అశ్వారావుపేట, కుక్కునూరు మీదుగా భద్రాచలం రాత్రికి చేరుకుంటారని వివరించారు. ఈ పర్యటనను ప్రజలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

మాదకద్రవ్యాలను అరికడదాం



డగ్స్ వద్దు బ్రో నినాదాల బ్రోచర్లు విడుదల చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ గ్రౌండ్స్‌లో జిల్లా యంత్రాంగం, ఎక్సైజ్, ఈగల్ టీం పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఎమ్మెల్యే బడేటి చంటి, విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయిలో 1972, నషా ముక్త్ భారత్ అభియాన్ టోల్ ఫ్రీ నంబర్ 14446, నాటుసారా నిరోధానికి 14405 నెంబర్లలో సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు.

15న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆగష్టు 15వ తేదీ ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ అనంతరం 10 గంటలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల లాభాలు నష్టాలు అనే అంశంపై (8, 9, 10 తరగతులు విద్యార్థులకు) వక్తృత్వం, 11 గంటలకు ఆపరేషన్ సిందూర్ అనే అంశంపై (8, 9, 10 తరగతుల విద్యార్థులకు) డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 90323 23632, 94930 59598లో సంప్రదించాలని తెలిపారు. విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

అభ్యంతరాలకు 15 రోజుల గడువు



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్ రాజు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డ్స్‌లో మార్పులు, చేర్పులకు 15 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. బుధవారం మాదేపల్లి సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పేరు స్పెల్లింగ్ సర్వే నెంబర్లు ఇతర అభ్యంతరాలను రైతులు 15 రోజుల్లోపు లికిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. రైతుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. డీటీ నాగమణి, ఆర్ఐ అజయ్, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, సర్వేయర్లు, రైతులు ఉన్నారు.

ఏలూరులో కుండపోత

● రోడ్లన్నీ జలమయం ● స్తంభించిన జనజీవనం



కట్టాసుబ్బారావు వీధిలో నిలిచిన వర్షపు నీరు

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏలూరు నగరంలో బుధవారం సాయంత్రం 5.30 గంటల నుంచి భారీ వర్షం ప్రారంభమైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆకస్మికంగా దట్టమైన మేఘాలు కమ్ముకుని, కొద్ది నిమిషాల్లోనే భారీ వర్షం ప్రారంభమైంది. దీంతో జనజీవనం స్తంభించింది. డ్రెయినేజీల్లో నీరు పొంగి రోడ్లపై ప్రవహించింది. ఆర్ఆర్‌పేటలో రోడ్లపై మోకాలిలోతు నీరు చేరింది. అశోక్ నగర్, పత్తేబాద, ఎన్ఆర్‌పేట, పవర్‌పేట, కొత్తపేట, 12 పంపుల సెంటర్, బీడీ కాలనీ, ఇజ్రాయేల్‌పేట, తంగెళ్లమూడి ఏరియాలతోపాటు ఏలూరు వన్‌టౌన్ పూర్తిగా వర్షంనీటితో నిండిపోయింది. ఎన్‌టీఆర్ కాలనీ, శాంతినగర్, శ్రీరామ్‌నగర్, శనివారపుపేట, పోణంగి రోడ్డు, వైఎస్సార్ కాలనీ ప్రాంతంలోనూ రోడ్లపై నీరు ప్రవహించింది. పలు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరే ప్రమాదం ఏర్పడింది.

ఏలూరు టౌన్



ఏలూరు పవర్‌పేట రోడ్డులో..



ఎన్ఆర్ పేటలో వర్షం



ఏలూరు జీజీహెచ్ వద్ద కురుస్తున్న వర్షం



నగరంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు



వెంకట్రామా థియేటర్ రోడ్డులో వర్షపు నీటిలోనే రాకపోకలు

హర్ ఘర్ తిరంగా వేడుకలు

ఏలూరు టౌన్: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పీజే అమృతం ఆధ్వర్యంలో తొలుత సిబ్బంది, వైద్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు అందరూ భారతదేశ మ్యాప్ ఆకారంలో నిలబడి, జాతీయ జెండాను చేతబట్టి నినాదాలు చేశారు. డాక్టర్ అమృతం మాట్లాడుతూ ఉద్యోగుల్లో పోటీతత్వం, స్నేహభావం, వృత్తిపట్ల అంకితభావం పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు, కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, రైతు బజారులో ఉద్యోగులు, నిమ్మకాయల రైతులు, వ్యాపారులు, ప్రజల భాగస్వామ్యంతో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఏలూరు చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏలూరు జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎండీపీ శ్రీనివాసరావు, ఏలూరు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జి.మంజుల, నిమ్మకాయల ట్రేడర్స్ యూనియన్ ప్రెసిడెంట్ చక్రపాణి, మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు, రైతు బజారు సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద వేడుకలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: భారీ వర్షాల కారణంగా అధికారులు గ్రామస్థాయి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రూరల్ మండలంలో అన్ని గ్రామాల్లో భారీ వర్షాల సమాచారం అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

'సీఆర్ఆర్'కు అటానమస్ హోదా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా మంజూరైందని ఆ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ విజయంతో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగవుతాయని, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిలో సరికొత్త దిశగా ప్రయాణిస్తామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు (నానాజీ) మాట్లాడుతూ 2025–26 నుంచి 2034–35 విద్యా సంవత్సరం వరకు తమ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా మంజురైందని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు మాట్లాడారు.

మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మల దహనం

ఏలూరు (టూటౌన్): కేంద్రలో మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టమని రైతు, కార్మిక, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపుమేరకు క్విట్ కార్పొరేట్ల నిరసన కార్యక్రమాన్ని ఏలూరులో పాత బస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బి కె యం యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే గౌస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడారు. ట్రంప్ సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ, ట్రంప్ దిష్టి బొమ్మలను దహనం చేశారు.



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యా హక్కు చట్టం-2009 పరిధిలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏలూరు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ కే. పంకజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 25 శాతం కోటాలో అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలు, అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు అర్హత ఉన్నవారికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఈ చట్టం ప్రకారం జిల్లాలో ఇప్పటికే రెండు విడతలుగా ప్రవేశాలు కల్పించామని, ఇంకా మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 20 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీఎన్ఎం / బీఎస్సీ నర్సింగ్ చదువుకొని 35 సంవత్సరాల్లోపు ఉన్న షెడ్యూల్డు కులాల మహిళలకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తోందని జిల్లా ఎస్సీ సొసైటీ కార్యనిర్వాహక సంచాలకులు ఎం ముక్కంటి తెలిపారు. 8 నుంచి 10 నెలల వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం జర్మనీ దేశంలో నర్సింగ్ ఉద్యోగం కల్పించి నెలకు రూ.2,40,000 (యూరో 2700) నుంచి రూ.3,10,000 (యూరో 3500)ల వరకు జీతం పొందడానికి అవకాశం ఉందని వివరించారు. జీఎన్ఎంలో మూడేళ్ల అనుభవం, బీఎస్సీ నర్సింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి గుంటూరులో శిక్షణ ప్రారంభమౌతుందని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 93468 90335, కె.రాంచందు 96665 45975, 99888 53335లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పథకం కూలీలకు 10 వారాలకు పైగా బకాయి పడ్డ వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మిడియం రవి దొర అధ్యక్షత వహించగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల జీవితాలతో ఆడుకుంటున్నాయని 10 వారాలకు పైగా వేతనాలను చెల్లించకపోవడం పేద ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణిని స్పష్టం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడుతూ పోలవరం మండలంలోని ఆదివాసీ ప్రజలు ఉపాధి కూలీ డబ్బులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ఉపాధి కూలీల డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అందించారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): కౌలు గుర్తింపు ఉన్న రైతులకు పంట రుణాలు బ్యాంకులో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రిను ఏపీ కౌలు రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు ఏలూరులో బుధవారం కోరారు. ఏపీ కౌలు రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. మండల స్థాయిలో సంయుక్త సమావేశాలు నిర్వహించాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డులు ఉండి, వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ ఇతర రుణాలు మంజూరు చేయాలన్నారు. భూ యజమానులకు రుణాలు ఇచ్చి, కౌలు రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని పేర్కొన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, ఏ బ్యాంకులైనా రైతులకు రుణాలు ఇచ్చే సమయంలో ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి తెలిపారని నాయకులు చెప్పారు. నీలాద్రిని కలిసిన వారిలో కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టెక్కలపాటి. ప్రసాద రావు, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే ఉన్నారు.



లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

స్కూల్ గేమ్స్ సెక్రటరీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు (ఎస్ఏ (పీడీ)/ పీఈటీ)గా పని చేస్తున్న వారి నుంచి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీగా మెరిట్‌పై రెండు సంవత్సరాల కాలానికి పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనే వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సిఫార్సులతో తమ దరఖాస్తులను ఈ నెల 20లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఏలూరులో సమర్పించాలని సూచించారు.

ఫలిస్తోన్న 'ఆపరేషన్ ట్రేస్'

● తల్లిదండ్రుల చెంతకు పిల్లలు
● ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: సమాజంలో నిరాధారణకు గురవుతూ, అనాథలుగా ఇతర చోట్ల ఆశ్రయం పొందుతూ, ఆయా కేసుల్లో హోమ్స్‌లో ఉంటూ తీవ్ర మానసిక వేధనకు గురవుతున్న పిల్లలను వారి తల్లిదండ్రులు, కుటుంబాల చెంతకు చేర్చే ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, శక్తి టీమ్ అధికారులు శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతిగృహంలో పిల్లలతో మమేకమయ్యారని తెలిపారు. 12 మంది బాలల కుటుంబాల అడ్రస్‌లు గుర్తించారని చెప్పారు. రెండున్నరేళ్ల నుంచి తల్లిదండ్రుల సమాచారం తెలియని నలుగురు బాలికలను కుటుంబాలకు అప్పగించామన్నారు. బాలుడి తల్లిదండ్రులను అమలాపురంలో గుర్తించగా, మరో బాలుడి తండ్రి మరణించగా, తల్లి వేరొక వ్యక్తిని వివాహం చేసుకోవటంతో చెన్నై ప్రాంతంలో పెంపకానికి పంపిందనని, బాలుడు అక్కడి నుంచి పారిపోయి చెన్నై చైల్డ్‌లైన్‌లో ఉంటున్నాడని తెలిపారు. బాలుడు భీమవరం పరిసర ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు. తల్లి లేకపోవటంతో అక్క, అన్న, పిన్నికి అప్పగించారు. ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలో ఆచూకీ తెలియని ఒక తల్లి, ఇద్దరు పిల్లలు, తడికలపూడి స్టేషన్ పరిధిలో రెండేళ్ల నుంచి ఆచూకీ తెలియని ఒక తల్లి, ఇద్దరు పిల్లలను వారి బంధువులకు అప్పగించామని వివరించారు. ఆపరేషన్ ట్రేస్‌లో ప్రతిభ చూపిన ఏలూరు మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, శక్తిటీమ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



ఎస్పీ కేపీ శివకిషోర్, అధికారులు

లీజు వాటాలు ఇప్పించి న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): సొసైటీ భూముల లీజు వాటాలను సభ్యులందరికీ ఇచ్చి న్యాయం చేయాలంటూ మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన ఎస్సీలు బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 1988లో ఫీల్డు లేబర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో గ్రామంలో 150 ఎకరాలు కేటాయించారని, అందులో జిగ్ జాగ్ అనగా పట్టా తప్పించి పట్టాలను 69 ఎకరాలకు మాత్రమే మనిషికి ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చారని వివరించారు. నాటి నుంచి నేటి వరకు మొత్తం 330 మంది కుటుంబాలవారు దానిపై వచ్చే ఫలసాయం సమానంగా అనుభవిస్తున్నట్టు తెలిపారు. కొంత కాలంగా గ్రామానికి సంబంధం లేని వారు సొసైటీలో 76.14 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి సొసైటీ భూమిని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సొసైటీ జనరల్ బాడీ మీటింగ్, సొసైటీ రెన్యూవల్ ఆడిట్ తదితర లావాదేవీలు నిర్వహించి, అందరికీ లీజు వాటాలు ఇప్పించే విధంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, సొసైటీ సభ్యులు కొరిపే రాజబాబు, గుడిమడి యోహాను, కె.శామ్యూల్, కె.సురేష్, వి.యేసేబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉనికిలి గ్రామస్తులు